క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారు శ్రీసరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి 150 మంది చిన్నారులతో పూజలు చేయించారు. అనంతరం వారికి పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు భక్తి శ్రద్ధలతో సరస్వతీ దేవికి కుంకుమ పూజలు, బతుకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మందిరం పాలకవర్గ సభ్యులు మోటుమర్రి సుబ్బారావు, పీవీఎల్ ప్రసాద్, పీ రజనీకాంత్, వై సుబ్బారావు, సాయి సేవకులు పాల్గొన్నారు. వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో పేద విద్యార్థులకు రాత పుస్తకాలు, ఎగ్జామ్స్ ప్యాడ్స్, పెన్నులు తదితర విద్యా సంబంధమైన వస్తువులను వితరణ చేశారు. దాతలు విజయ్ కుమార్, సుధీర్, సురేష్ ఆయా వస్తువులను స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ముత్తంశెట్టి దుర్గ కిషోర్, సెక్రటరీ విజయలక్ష్మి, చైల్డ్ ఫండ్ స్వచ్ఛందసంస్థ మానికొండ జోన్స్, టీఎల్ రాజు, సతీష్ కుమార్, షేక్ సద్దాం, టీచర్స్, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

గుండె సంరక్షణకు జీవన శైలిని మార్చుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): గుండె సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిని మార్చుకోవాలని శ్రీభవానీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెనిగళ్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా భవానీపురంలోని శ్రీభవానీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక స్వాతి సెంటర్ నుంచి గొల్లపూడి వన్ సెంటర్ వరకు 3 కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం గంటపాటు వాకింగ్, జిమ్ లేదా యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అలాగే ధూమపానం, మద్యపానం, గుట్కా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. శ్రీభవానీ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 50 ఏళ్లు దాటిన వారు బీపీ, షుగర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, 80 శాతం వ్యాధులు మనం నివారించుకునే స్థాయిలోనే ఉంటాయని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్‌కుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సెక్రటరీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ శివనాథ్



విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): భక్తుల సహకారంతో ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. సోమవారం మూలానక్షత్రం సందర్భంగా ఎంపీ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అధికారులు, వేదపండితులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. క్యూ లైన్‌లో పాల కేంద్రాన్ని సందర్శించి భక్తులకు పాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సోమవారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

విజయవాడకల్చరల్: కనకదుర్గానగర్‌లోని కళా వేదికపై ప్రదర్శిస్తున్న సంగీత, నృత్య కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు సాగాయి. ఎన్‌వీ నాగయ్య తాళం భజనతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తిరంజని కార్యక్రమంలో భాగంగా ఎంఎస్‌ఆర్‌వీ ప్రసాద్, ఎ.సాహితీ, జి.కావ్య బృందం, హైదరాబాద్‌కు చెందిన హనుమంతరావు శివ భక్త విజయం కథన శ్రావ్యంగా వినిపించారు. వైఎస్‌వీకే సంతోష్ బృందం వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సప్పశివకుమార్ బృందం, కాకినాడుకు చెందిన కౌండిన్య, సాయి నిహారిక, పి.కల్యాణ్, బి.వెంకట్రామశర్మ, పీజీ పాత్రుడు, ఎస్.సానిక, బీటీ సుందరి, కె.సాహితీలక్ష్మి, ఎస్‌ఎం కౌండిన్య, ఎల్‌ఎం భువనేశ్వరి, హైదరాబాద్‌కు చెందిన విజయవల్లి భువనేశ్వరి, హవిషా చౌదరి, డి.రాజేశ్వరి, కె.మనోజ్ఞలు కూచిపూడి, భరతనాట్యం సంప్రదాయంలో సెమీ క్లాసికల్ నృత్యాలను మనోహరంగా అభినయించారు. సైదా, గంగాధర్ కళాకారులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. రామకృష్ణ పర్యవేక్షించారు.

దారులన్నీ అమ్మ సన్నిధికే..





ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వన్‌టౌన్ పరిసరాలు భక్తజనంతో కిటకిటలాడాయి. సాయంత్రం నిర్వహించిన ఆది దంపతుల నగరోత్సవం, కళాకారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









కార్యకర్తలకు రక్షణ కవచంలా డిజిటల్ బుక్



నాలుగు స్తంభాల సెంటర్‌లో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని క్లస్టర్-1 (37, 38, 39, 44 డివిజన్లు) అధ్యక్షుడు బొండా నిరీష్ అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో సోమవారం సాయంత్రం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిరీష్ మాట్లాడుతూ డిజిటల్ బుక్ ప్రతి కార్యకర్త, నాయకుడికి రక్షణ కవచంలా ఉంటుందన్నారు. అక్రమ కేసులను కార్యకర్తలు ఎప్పటికప్పుడు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో దాసి జయప్రకాష్ కెనడి, బొమ్ము మధు, పొదిలి చంటిబాబు, పెద్ది సత్య సాయి బాబు, బషీర్, కరీం, జీ వినోద్, రుద్రశంకర్, అంకాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో..

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సోమవారం సాయంత్రం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ జోగి రమేష్ ఆదేశాల మేరకు కాలనీలోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ సందర్భంగా ఎంపీటీసీ కొరగంజి సత్యనారాయణ, మైలవరం మేధావుల ఫోరం అధ్యక్షుడు నక్కా ప్రభుదాస్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి కుంభా నాగరాజు, కాలనీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారపాక రాంబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్యాయానికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించడమే డిజిటల్ బుక్ యాప్ ముఖ్య ఉద్దేశమన్నారు. నాయకులు ముళ్లా లాజర్, బుర్ర రాము, వల్లపు రామారావు, వై.శ్యామ్, నీలం చందు, పూజల వెంకటేష్, మహిళా నాయకురాలు పెద్ది రాంబాయిమ్మ తదితరులు పాల్గొన్నారు.



45వ డివిజన్‌లో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

డిజిటల్ బుక్ కార్యకర్తలకు శ్రీ రామరక్ష

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): డిజిటల్ బుక్ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు శ్రీ రామరక్ష అని కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి అన్నారు. సోమవారం భవానీపురం 45వ డివిజన్ కార్యాలయంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంచార్జ్ కేసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, క్లస్టర్ త్రీ ఇంచార్జ్ కేసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ డిజిటల్ బుక్ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు కొండంత అండ అన్నారు. నాయకులు సరగడ్ శంకర్ రెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి, ఎం.వాసు, ఉండేల శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో అష్టకష్టాలు



మండుటెండలో వేచి ఉన్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధికి తరలివచ్చిన భక్తజనం సోమవారం అష్టకష్టాలు పడింది. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో అత్యంత కీలకమైన మూలానక్షత్రం రోజున దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు కనీస వసతులు లేక అల్లాడిపోయారు. ఒక వైపు భానుడి భగభగలు మరో వైపు మంచినీరు ఇచ్చే వారు కానరాక తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నామంటూ పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీరుతో పాటుగా ఆహారం సైతం అందక పలువురు ఆకలితో అలమటించామంటూ వాపోయారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లకు ముందుగా భక్తులను నగరపాలకసంస్థ కార్యాలయం, అక్కడి నుంచి పక్కనే ఉన్న హోల్డింగ్ కంపార్ట్‌మెంట్లకు మళ్లించారు. అక్కడి కొద్దిసేపు ఉంచిన తరువాత వినాయకునిగుడి వద్ద ఉన్న క్యూలైన్లలోకి అనుమతించారు. అయితే పదుల సంఖ్యలో కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసిన అధికారులు అక్కడ కనీస వసతులను ఏర్పాటు చేయకపోవటంతో భక్తులు తమను బయటకు పంపిస్తే వెళ్లిపోతామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మంచి నీరు లేక అల్లాడిపోయారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భవానీలు ఏర్పాట్లపై తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. క్యూలైన్లలో ఆరేడు గంటల పాటు ఉంచారని, కనీసం తినటానికి ఏమి పెట్టలేదంటూ వాపోయారు.

కూటమి నేతలకే దర్శనం

దసరా ఉత్సవాల్లో సాధారణ భక్తులు కన్నా కూటమి నేతలకే అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని భక్తులు మండిపడుతున్నారు. ఒకవైపు అందరూ క్యూలైన్లలోనే కొండపైకి రావాలని చెబుతున్నా పదుల సంఖ్యలో వాహనాల్లో కూటమి నేతలు కొండపైకి చేరుకుంటున్నారు. పలువురు వీవీఐపీలతో వచ్చిన వాహనాలకు తోడు ఇతర వాహనాలు సైతం కొండపైకి రావటం, వారంతా దర్శనానికి తరలివెళ్లటంతో కొండపైన సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. మహామండపం నుంచి కొండపైకి వచ్చే లిఫ్ట్ వద్ద అధికారులు దురుసుగా ప్రవర్తిస్తుండటంతో ఆలయ సిబ్బంది ఇక్కట్లకు గురయ్యారు. ఐడీ కార్డుతో పాటుగా డ్యూటీ పాస్ కలిగిన సిబ్బంది, అధికారులు లిఫ్ట్ ద్వారా పైకి చేరుకునేందుకు అవకాశం లేదంటూ పోలీసు అధికారులు అడ్డుకున్నారు. సూపరింటెండెంట్ స్థాయి అధికారులను సైతం లిఫ్ట్‌లోకి అనుమతించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సకాలంలో ఆయా ప్రాంతాలకు చేరుకోవటానికి పోలీసుల చర్యలు అడ్డంకిగా మారాయంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద ముంపులో పున్నమి ఘాట్, భవానీ ద్వీపం



బోటింగ్ జెట్టీపైకి చేరిన వరద నీరు



పున్నమి ఘాట్‌లో వేసిన ఇసుక బస్తాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాగార్జునసాగర్, పులిచింతల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీకి 70 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో భవానీపురంలోని హరిత బెరం పార్క్‌కు వరద నీటి తాకిడి పెరిగింది. పున్నమి ఘాట్, బెరంపార్క్‌లోని లాన్‌లోకి వరద నీరు వచ్చి చేరింది. విషయం తెలిసిన బెరంపార్క్ యూనిట్ మేనేజర్ శ్రీనివాస్ అప్రమత్తమై సోమవారం తెల్లవారు జామునే పున్నమిఘాట్ నుంచి వరద నీరు మరింత లోపలకు రాకుండా సిబ్బందితో ఇసుక బస్తాలను వేయించారు. అయినా ఆగని నీటి ప్రవాహం చొచ్చుకుని వస్తూనే ఉంది. బెరంపార్క్‌లోని బోటింగ్ పాయింట్‌లోకి వరద నీరు చేరింది. ఇప్పటికే బోటింగ్ సర్వీస్‌లను నిలిపి వేసిన సంగతి తెలిసిందే. హరిత బెరంపార్క్‌లోకి పర్యాటకులు/సందర్శకుల ప్రవేశాన్ని నిషేధించారు. నిన్నటి వరకు భవానీ ద్వీపాన్ని చుట్టుముట్టిన వరద నీరు ఇప్పుడు ద్వీపం లోపలకు చేరింది. దీంతో అక్కడి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గత వరదల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో మళ్లీ వరద రావడంతో రెండు పర్యాటక ప్రదేశాల్లో చేపట్టిన పనులన్నీ వృథా కానున్నాయి.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



వినాయకుని గుడివద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల దర్శనానికి వెళ్లే భక్తులకు వాటర్ ట్యాంకర్లతో కార్పెట్లపై నీళ్లు చల్లాలని అధికారులను ఆదేశించామన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన వినాయకుని గుడి, కెనాల్ రోడ్డు, సీతమ్మ వారి పాదాలు, మోడల్ గెస్ట్ హౌస్, ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజున భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నందున హోల్డింగ్ ఏరియా నుంచి వినాయకుడి గుడి వరకు కార్పెట్లు వేసి, కార్పెట్ల పైన వాటర్ ట్యాంకర్లతో ద్వారా నీటితో తడపాలని, ప్రతి వాటర్ పాయింట్‌లో తగినంత స్టాక్ ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ఇతర విభాగాలతో సమన్వయంతో పని చేస్తూ మోడల్ గెస్ట్ హౌస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సరస్వతీదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు



సరస్వతీదేవిగా విజయదుర్గా అమ్మవారు



సరస్వతీదేవి అలంకారంలో గంగానమ్మ తల్లి



సరస్వతీదేవిగా పద్మావతి అమ్మవారు



సరస్వతీదేవిగా భ్రమరాంబ మాత

చదువుల తల్లి కటాక్షించమ్మా !




శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న వెలంపల్లి

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం అమ్మవార్లు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హోమాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

–వన్‌టౌన్/చిట్టినగర్/భవానీపురం(విజయవాడపశ్చిమ)



పాతశివాలయంలో చిన్నారికి అక్షరాభ్యాసం



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో..



శ్రీ గంగా, దుర్గా, మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో



ఊర్మిళా సుబ్బారావునగర్ పోలేరమ్మ దేవస్థానంలో..